ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

బుధవారం 17 ఏప్రిల్ 2024



తోటపల్లిలో శ్రీరామనవమి ఏర్పాట్లు పూర్తి

గరుగుబిల్లి,ఎప్రిల్ 16: శ్రీ రామనవమి సందర్భంగా తోటపల్లి కోదండ రామ స్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు బుధవారం సీతా రామస్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఉదయం ఆలయంలో శ్రీరామ సుప్రభాతసేవ, ఆరాధన, మంగళ శాసన ములు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈవో వీవీ సూర్యనారా యణ మంగళవారం తెలిపారు. 9 గంటలకు కోదండ రామస్వామి ఆలయ ప్రాంగ ణంలో స్వామివారి కల్యాణ మహోత్సవం చేపట్టనున్నట్లు వెల్లడించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

సత్తాచాటారు

- సివిల్స్‌లో మెరిసిన పార్వతీపురం వాసులు
- ఆలిండియా స్థాయిలో ఇద్దరికి ఉత్తమ ర్యాంకులు
- ఆనందంలో కుటుంబ సభ్యులు

పార్వతీపురం టౌన్, ఏప్రిల్ 16: సివిల్స్ ఫలితాల్లో పార్వతీపురం పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు సత్తాచాటారు. ఆలిండియా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. దీంతో వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బంధువులు, స్నేహితులు వారి నివాసాలకు వెళ్లి అభినందనలు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాకేంద్రంలో కొత్తవలస మణికంఠ కాలనీకి చెందిన బండి ఓంకార్ తొలి ప్రయత్నంలోనే ఆలిండియా స్థాయిలో 202 ర్యాంకు సాధించారు. ఆయన తండ్రి బండి వీర్రాజు పట్టణంలోని బైపాస్ రహదారిలో మెకానిక్ షాపు నిర్వహిస్తున్నారు. తల్లి చంద్రకళ గృహిణిగా ఉన్నారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు పార్వతీపురంలోని ఓ పాఠశాలలో ఓంకార్ చదివారు. గుంటూరులోని ఓ కళాశాలలో ఇంటర్ పూర్తిచేశారు. పార్వతీపురంలోని కళాశాలలో డిగ్రీ దూర విద్యను అభ్యసిస్తూ, సివిల్స్‌కు సిద్ధమయ్యారు. ప్రిలిమ్స్ పాసైన అనంతరం న్యూఢిల్లీలో మెయిన్స్ కోచింగ్ తీసుకున్నారు. మొత్తంగా తొలి ప్రయత్నంలోనే సివిల్స్‌లో ఆయన విజయం సాధించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే సివిల్స్‌లో మంచి ర్యాంకు సంపా దించగలిగానని ఓంకార్ తెలిపారు. తన పేరు రిజర్వ్ లిస్టులో ఉందన్నారు.

- పార్వతీపురంలో సౌందర్య నారాయణమూర్తి నగర్‌కు చెందిన పృథ్వీ రాజ్‌కుమార్ రెండో ప్రయత్నంలోనే సివిల్స్‌లో 493వ ర్యాంకు సాధించారు. ఆయన తండ్రి దొనక విజయ్‌కుమార్ పార్వతీపురం మండలం ఎమ్మార్ నగర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి వెంకటరత్నం కూడా అదే పాఠశాలలో రికార్డు అసి స్టెంట్‌గా పనిచేస్తున్నారు. కాగా పృథ్వీ 1 నుంచి 5వ తరగతి వరకు కురుపాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివారు. అనంతరం పార్వతీపురంలోని ఓ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో డిగ్రీ చదివారు. ఇక అప్పటి నుంచి ఆయన ఇంటి వద్దే ఉంటూ సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. కాగా సివిల్స్ తొలి ప్రయత్నంలో ఆయన ఇంటర్వ్యూకు వరకు వెళ్లి ఫెయిల్ అయ్యారు. అయితే రెండో ప్రయత్నంలో మాత్రం విజయం సాధించారు. జాగ్రఫీ, హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సబ్జెక్టులను ఎంపిక చేసుకొని సివిల్స్‌లో విజయవంతమైనట్లు పృథ్వీ రాజ్‌కుమార్ మంగళవారం విలేఖర్లకు తెలిపారు. చిన్ననాటి నుంచి ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఉన్న తనకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా తోడవడంతో సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించగలిగానని ఆయన చెప్పారు.



తల్లిదండ్రులతో పృథ్వీ రాజ్‌కుమార్



తల్లిదండ్రులతో ఓంకార్

- **కురుపాం:** పృథ్వీ రాజ్‌కుమార్‌తండ్రి గతంలో కురుపాంలో ఉండేవారు. అక్కడ ఎంఈవోగా పనిచేశారు. ప్రస్తుతం పార్వతీపురంలో ఉన్నప్పటికీ.. ఆయన కుమారుడు పృథ్వీ సివిల్స్‌లో ఉత్తమ ర్యాంకు కైవసం చేసుకోవడంతో కురుపాం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కోడ్ ఉంటే మాకేం?

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వైసీపీ నేతలు
- పార్వతీపురం నియోజకవర్గంలో ఉల్లంఘనలు
- అయినా చర్యలు అంతంతమాత్రమే..
- ఈ పరిణామాలతో ప్రజల్లో ఆందోళన



(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)



ప్రశాంత వాతావరణానికి కేరాఫ్ పార్వతీపురం మన్యం జిల్లా. అయితే ఎన్నికల వేళ సీన్ మారింది. ఎన్నడూ లేని విధంగా జిల్లాకేంద్రం పార్వతీపురంలో ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో సజావుగా ఎన్నికలు జరిగేనా? అన్న సందేహాలు వ్యక్తమవు తున్నాయి. ప్రధానంగా పార్వతీపురంలో నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు కోడ్‌ను పట్టించుకోవడం లేదు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. దీనిని ప్రశ్నించిన వారిపై దాడులు, దూషణలకు దిగుతున్నారు. అక్రమ కేసులు పెడుతున్నారు. దీంతో జిల్లాకేంద్రంలో ఎప్పుడు ఏమి జరుగుతుందో, ఎవరి మీద ఎవరు ఫిర్యాదులు చేసుకుంటారో తెలియని పరిస్థితి ఏర్పడింది. అధికార యంత్రాంగం కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాక్షాత్తూ జిల్లా కేంద్రంలోని ఇలా ఉంటే.. మిగిలిన ప్రాంతాల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. కొద్దిరోజులుగా పార్వతీపురంలో అధికార పార్టీ నేతలు ఏ విధంగా వ్యవహరించారో ఇప్పుడు తెలుసుకుందాం.

- దివ్యాంగులు, 85 సంవత్సరాలు నిండిన వృద్ధులకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని కల్పించిన విషయం తెలిసిందే. అయితే దీనిని కూడా వైసీపీ నాయకులు తమకు అనుకూలంగా మార్చుకున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది. ప్రధానంగా పార్వతీపురం నియోజకవర్గంలో అనేక పంచాయతీల్లో వలంటీర్ల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా దివ్యాంగులు, వృద్ధుల నుంచి పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12డీ దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియను దాదాపుగా పూర్తి చేశారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు వెళ్లగా.. పలువురు వలంటీర్లను విధుల నుంచి తొలగించిన విషయం విదితమే.
- వైసీపీ అభ్యర్థి, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు పేరుతో ఓ వాయిస్ మెసేజ్ ఇప్పుడు వైరల్ అవుతోంది. 'ఎన్నికల్లో వలంటీర్లు వైసీపీకి సహకరించాలి. సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలు దృష్టిలో పెట్టుకొని లబ్ధిదారులంతా వైసీపీకి ఓటు వేసే విధంగా చూడాలి' అని జోగారావు వాయిస్‌తో ఓ మెసేజ్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. అయితే దీనిపై ప్రజలు మండిపడుతున్నారు. ఇది కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరించినట్లు కాదా? అని ప్రశ్నిస్తున్నారు.
- ఈ నెల 14న ఎమ్మెల్యే జోగారావు తన ఇంటిలో వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధం. దీనిపై అధికారులకు ఫిర్యాదులు వెళ్లినప్పటికీ..సకాలంలో స్పందించని పరిస్థితి. దీంతో టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులు, కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న విషయం తెలిసిందే. చివరకు పోలీసులు చేరుకోవడంతో వివాదం సద్దుమణిగింది. లేదంటే హింసాత్మకమైన ఘటనలు జరిగేవనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.
- ఈ నెల 14న పార్వతీపురంలో రాయగడ రోడ్డు వద్ద ఎన్నికల ప్రచారానికి వైసీసీ నేతలు అనుమతులు పొందారు. కానీ అనుమతులు పొందిన చోట సమావేశం నిర్వహించలేదు. ఎమ్మెల్యే జోగారావు, ఆ పార్టీ నేతల ఆధ్వర్యంలో రోడ్డును బ్లాక్ చేసి సిద్ధం సభను నిర్వహించారు.ఇది నూటికి నూరు శాతం ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లే. సుమారు మూడు గంటల పాటు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ కూడా స్తంభించింది. అయితే దీనిపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, ఎన్నికల అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్థానికంగా అధికార యంత్రాంగం ఉన్నా..

కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్, ఆర్డీవో తదితర అధికారులంతా పార్వతీపురం జిల్లా కేంద్రంలోని ఉన్నారు. అయినప్పటికీ పార్వతీపురంలో వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను వారు ఉల్లంఘిస్తున్నారు. అయినా వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చేనెలలో స్వేచ్ఛగా ఓటు వేసుకోగలమో?లేదోనని నియోజకవర్గవాసులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా, ప్రశాంత వాతవావరణంలో పోలింగ్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఓటర్లు కోరుతున్నారు.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- అభ్యర్థితో పాటు ఐదుగురికే అనుమతి
- ఆర్వో విష్ణుచరణ్

సాలూరు రూరల్, ఏప్రిల్ 16: సాలూరు నియోజకవర్గ శాసనసభ స్థానానికి పోటీ పడే అభ్యర్థుల నుంచి గురు వారం నుంచి నామినేషన్లు స్వీక రించనున్నట్లు రిటర్నింగ్ అధికారి సి.విష్ణుచరణ్ తెలిపారు. నామినేషన్ వేసే సమయంలో ఐదుగురిని మాత్రమే లోపలకు అను మతి స్తామని చెప్పారు. ఈ మేరకు ఏర్పాట్లపై ఏఆర్వో సింహాచలం, అధికారులతో మంగళవారం సమీక్షించారు. గురువారం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని చెప్పారు. అదేరోజు నుంచి ఈ నెల 25 వరకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చన్నారు. 26న నామి నేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణకు తుది గడువు అని తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధన లను పాటించాలన్నారు. 13 రకాల పత్రాలు సక్రమంగా ఉంటేనే నామినేషన్ వేసేందుకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. శాసనసభ నియోజకవర్గం కోసం ఫారమ్ 2బీ సమర్పించాలన్నారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినే షన్లు స్వీకరిస్తామన్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో స్వీకరణ ఉండదని. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు సమర్పించొచ్చని తెలిపారు. ఈ సమయంలో వంద మీటర్ల పరిధిలో మూడు వాహనాలనే అనుమతి స్తామన్నారు. నామినేషన్లు దాఖలు నుంచి అభ్యర్థుల ఖర్చులను లెక్కిస్తామని, పత్రికల్లో ప్రకటనలు, పెయిడ్ న్యూస్, ఇతర ఖర్చులు అభ్యర్థి ఖాతాలోకే వస్తాయని వెల్లడించారు. నామి నేషన్ల స్వీకరణకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల పరిశీలకులు వస్తున్నారని, ఫిర్యాదులు వారి దృష్టికి సైతం తీసుకెళ్లొచ్చని తెలిపారు.



సిబ్బందితో చర్చిస్తున్న ఆర్వో విష్ణుచరణ్

మణిగలో మలేరియా

- రెండు కేసులు గుర్తింపు
- ఆ గ్రామాన్ని సందర్శించిన డీఎంవో

భామిని: తివ్వకొండ శిఖరాన ఉన్న మణిగలో రెండు మలేరియా పాజిటివ్ కేసులను గుర్తించారు. దీంతో మంగళవారం ఆ గ్రామాన్ని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) జగన్మోహన్‌రావు సందర్శించారు. వైద్య బృందాలతో ఇంటింటా పర్యవేక్షణ చేశారు. జ్వరాల లక్షణాలపై ఆరా తీశారు. దోమ తెరలు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒడిశా-ఆంధ్రా సరిహద్దు గ్రామాల ప్రజలు మలేరియాపై అప్రమత్తంగా ఉండా లన్నారు. పనుల కోసం అంతర్రాష్ట్ర గ్రామాలకు వెళ్లి వచ్చేవారి ఆరోగ్య స్థితిగతులపై ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు నిఘా ఉంచాలని సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం పనికిరాదన్నారు. గ్రామాల్లో రోగులు, జ్వర పీడితులను గుర్తించి, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా చూడాలని సూచించారు. అనంతరం భామిని, బత్తిలి పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ఈ సందర్శనలో ఆయన వెంట వైద్యాధికారులు షోలో, దామోదర్, భాస్కరరావు, అప్పారావు తదితరులు ఉన్నారు.

డెంగ్యూ నిర్ధారణ పరీక్షల పరిశీలన

పాలకొండ: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షల నిర్వహణ, తీరును మంగళవారం డీఎంవో టి.జగన్మోహన్‌రావు పరిశీలించారు. ఆసుపత్రిలో రోజూ నిర్వహిస్తున్న మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు, పరికరాల వాడుక విధానం, జ్వర పీడితుల వివరాలపై ఆరా తీశారు. ఎఫ్ఎం-7, ఎం-3 ల్యాబ్ రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. మలేరియా, డెంగ్యూ నిర్ధారణ అయితే సంబంధిత ఐహెచ్ఐపీ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులందరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు వ్యాధి నిర్ధారణ పరీలు జరపాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ పరిశీలనలో ఏఎంవో సూర్యనారాయణ, జిల్లా వీబీడీ కన్సల్టెంట్ రామచంద్ర, సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు, ఎంటీఎస్ భువనేశ్వర్ తదితరులు ఉన్నారు.



దోమ తెరల వినియోగంపై మణిగ వాసులకు సూచినలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

అప్రమత్తంగా ఉండాలి

- స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలకు పాలకొండ ఆర్వో ఆదేశం

సీతంపేట, ఏప్రిల్ 16: ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేసేం దుకు నియమించిన స్టాటిక్ సర్వేలెన్స్ బృం దాలు అప్రమత్తంగా వ్యవహరించాలని పాల కొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి అన్నారు. మంగళవారం ఐటీడీఏలోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎవరైనా రూ.50 వేలకు మించి ఎక్కువ నగదు, రూ.10వేల కంటే అధిక విలువ ఉన్న వస్తువులను తీసుకెళ్తే సంబంధిత పత్రాలను తనిఖీ చేయాలన్నారు. అన్ని సరిపోకపోతే.. నిబంధనల ప్రకారం సీజ్ చేయాలని సూచించారు. సరిహద్దు చెక్‌పోస్టుల్లో మద్యం, ఇతర నిషేధిత వస్తువులు రవాణా అయ్యే అవకాశం ఉన్నందున అత్యంత అప్ర మత్తంగా ఉండాలని తెలిపారు. రోజూ తనిఖీ వివరాలు, నివేదికలను ఆర్వో కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. సీతంపేట ఎస్ఐ జగదీష్ నాయుడు, ఎస్ఎస్‌టీ టీమ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు పటిష్ఠ భద్రత

పాలకొండ: పాలకొండ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను పాలకొండలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేసినట్టు ఆర్వో కల్పనాకుమారి తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల అధికారులు, పోలీస్ అధికారుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను భద్రపరిచి సీల్ వేస్తామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లోకి ఎవరికీ అనుమతి ఇవ్వొద్దని పోలీసు సిబ్బందికి సూచించారు.



స్ట్రాంగ్ రూమ్ వద్ద ఆర్వో కల్పనాకుమారి తదితరులు

వైసీపీ రాజకీయ స్వార్థానికి
వలంటీర్లు బలి

- కొంతమందిపై కేసు నమోదు
- వైసీపీ అభ్యర్థిపై మాత్రం చర్యలు శూన్యం



పార్వతీపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజకీయ స్వార్థానికి కొంతమంది వలంటీర్లు బలవుతున్నారు. అధికార పార్టీ నేతల చేతలతో వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ నెల 14న వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే జోగారావు తన ఇంటి వద్ద వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై టీడీపీ అభ్యర్థి బోనెల విజయచంద్ర అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సకాలంలో అధికారులు స్పందించ లేదు. దీంతో టీడీపీ, జనసేన నాయకులు అక్కడకు చేరుకో వడంతో ఉద్రిక్తత చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఇదే సమయంలో కొంతమంది వలంటీర్లు ముసుగులు వేసుకుని అక్కడి నుంచి పరుగులు తీయడం చర్చనీయాంశమైంది. దీనిపై అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. స్క్వాడ్ బృందం రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. వారి ఫిర్యాదు మేరకు చివరకు 24 మంది వలంటీర్లపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేసు నమోదు వల్ల వలంటీర్ల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందని, వారి జీవితాలను నాశనం చేసే హక్కు వైసీపీకి ఎవరిచ్చారని జిల్లావాసులు ప్రశ్నిస్తున్నారు.

ఒత్తిళ్లే కారణమా?

ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని, ఏ ఒక్క రాజకీయ పార్టీకి మద్దతు తెలపొద్దని ఎన్నికల సంఘం పదేపదే హెచ్చరిస్తున్న సంగతి తెలిసిందే. అయితే మరోవైపు వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో వలంటీర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనిలో భాగంగా వైసీపీ అభ్యర్థి జోగారావు ఇంటిలో సమావేశానికి వలంటీర్లు వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే వైసీపీ తన రాజకీయ లబ్ధికోసం వలంటీర్లను ఉపయోగించుకుంటూ కేసులు నమోదు చేసే వరకు తీసు కెళ్లడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. కొంతమంది వలంటీర్లు కూడా దీనిపైనే యోచి స్తున్నారు. వైసీపీ నేతల కోసం తమ భవిష్యత్ ఎందుకు పాడుచేసుకోవాలని భావిస్తున్నారు.

వైసీపీ అభ్యర్థిపై కేసు నమోదు చేయరా?

వైసీపీ అభ్యర్థి జోగారావు ఇంటికి వలంటీర్లు వెళ్లినట్టుగా నిర్ధారించిన అధికారులు వారిపై చర్యలు తీసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. కానీ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వైసీపీ అభ్యర్థిపై మాత్రం ఎటువంటి కేసు నమోదు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జోగారావుపై కూడా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఎందుకు ఫిర్యాదు చేయలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వలంటీర్లకు ఒక న్యాయం, వైసీపీ అభ్యర్థికి ఒక న్యాయమా? అంటూ టీడీపీ, ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల అధికారుల తీరుపై పెదవి విరుస్తున్నారు.

ఎటువంటి ఆధారాలు లేవంట...

ఈ నెల 14న వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే జోగారావు తన ఇంటి వద్ద వలంటీర్లతో సమావేశం నిర్వహించినట్టు వచ్చిన ఆరోపణలపై ఎంపీడీవో షేక్ మహ్మద్ అకీబ్ జావేద్‌ను వివరణ కోరగా.. వలంటీర్లతో వైసీపీ అభ్యర్థి సమావేశం నిర్వహించినట్టు ఎటువంటి ఆధారాలు లేవన్నారు. దీనిపై ఎమ్మెల్యే జోగారావును కూడా ప్రశ్నించామని తెలిపారు. వలంటీర్లను తాను పిలవలేదని జోగారావు సమాధానమిచ్చినట్లు ఎంపీడీవో చెప్పుకొచ్చారు.

24 మంది వలంటీర్లపై ఎఫ్ఐఆర్

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలం నర్సిపురం, పెద్దబొండపల్లి గ్రామాలకు చెందిన 24మంది వలంటీర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు. ఈ నెల 14న వైసీపీ అభ్యర్థి, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు తన ఇంటి వద్ద నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి పలువురు వలంటీర్లు వెళ్లినట్టు అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం విచారణ చేపట్టింది. అనంతరం వారి ఫిర్యాదు మేరకు 24 మంది వలంటీర్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పార్వతీపురం రూరల్ ఎస్ఐ దినకరన్ మంగళవారం తెలిపారు. ఇదే విషయంపై పార్వతీపురం ఎంపీడీవో షేక్ మహ్మద్ అకీబ్ జావేద్‌ను వివరణ కోరగా.. వైసీపీ అభ్యర్థి జోగారావు ఇంటిలో నిర్వహించిన సమావేశానికి వలంటీర్లు వెళ్లడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనిపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఇచ్చిన నివేదిక ప్రకారం.. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

ముసుగు తొలగించారు...

గరుగుబిల్లి, ఏప్రిల్ 16: గరుగుబిల్లి మండలంలోని పలు సచివాలయాల పరిధిలో వలంటీర్లు ముసుగు తొలగిస్తున్నారు. రాజీనామాలు చేసిన తర్వాత వైసీపీ కార్యకర్తలుగా ప్రత్యక్షమవుతున్నారు. గరుగుబిల్లిలో సోమవారం రాత్రి కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి సమావేశం నిర్వహించారు. కాగా రాజీనామా చేసిన కొంత మంది వలంటీర్లు వైసీపీ కండువాలతో ఈ సమావేశంలో కనిపించడం చర్చనీయాంశమైంది. వలంటీర్లతో బలవంతపు రాజీనామాలు చేయించి ప్రచారాలకు హాజరయ్యేలా పార్టీ ప్రతినిధులు ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. రాజీనామాలకు ఇష్టం లేకపోయినా ప్రతినిధుల ఆదేశాలను ధిక్కరించలేని స్థితిలో వలంటీర్లు ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలకు చర్యలు

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

గరుగుబిల్లి, ఏప్రిల్ 16: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. గరుగుబిల్లి మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన రావివలస, ఉద్దవోలు, ఉల్లిభద్ర తదితర పోలింగ్ కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలని కోరారు. చినమేరంగి సీఐ బి.మంగరాజు, ఎస్ఐ వై.అమ్మనరావుకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఇప్పటికే సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు వారు వివరించారు.



రావివలస పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

సిబ్బంది లేరు.. వసతులు కరువు

● అప్‌గ్రేడ్‌చేసినా పర్యవేక్షణ లేని వైనం ● ఇదీ ధర్మవరం ప్లస్ టూ గర్ల్స్ హైస్కూల్‌లో పరిస్థితి

● ఈ ఏడాది ఇంటర్ ద్వితీయ సంవత్సరం ముగ్గురు పరీక్షలు రాయగా ఇద్దరు, ప్రథమ సంవత్సరం పన్నెండు మంది రాస్తే ఐదుగురు విద్యార్థినులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శృంగవరపుకోట మండలంలోని ధర్మవరం ప్లస్ టూ గర్ల్స్ హైస్కూల్‌లో ఉత్తీర్ణత సాధించారు.

శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం హైస్కూల్‌ను ప్లస్ టూ గర్ల్స్‌గా అప్‌గ్రేడ్ చేసినా ప్రభుత్వం వసతులు కల్పించలేదు. బోధనకు అవసరమైన పూర్తిస్థాయి అధ్యాపకులు, సిబ్బంది సైతం నియమించలేదు. అక్కడ స్థానికంగా ఉన్న ఉపాధ్యాయులతోనే నెట్టుకురావల్సివస్తోంది. ప్లస్ టూ గర్ల్స్ హైస్కూల్‌పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ల్యాబ్స్ వంటి వసతులు కొరవడడంతో ఈ ఏడాది ఇటీవల విడుదలైన ఇంటర్‌లో తక్కువ శాతం ఉత్తీర్ణత నమోదైందని బాలికల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

తాము అధికారంలోకి వస్తే మండలానికో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని 2019 సార్వత్రిక ఎన్నికల ముందు వైసీపీ వాగ్దానం చేసింది. అధికారం చేపట్టిన తర్వాత ఆ హామీని నిలబెట్టుకోలేక పోయింది. అయితే ఆదర్శపాఠశాలలు, కస్తూర్బా బాలికల పాఠశాలలు లేని మండలాలకు హైస్కూల్ ప్లస్ పేరుతో పదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు స్థాయిను పెంచారు. ఎస్.కోట మండలంలో ఎక్కడా కస్తూర్బా బాలికల, ఆదర్శ పాఠశాలలు లేకపోవడంతో ఈ మండలానికి హైస్కూల్‌ను ప్లస్‌టూ అవకాశం కల్పించారు. ఇప్పటికే ఎస్.కోటలో బాలబాలికలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నాయి. ఈ నేపథ్యంలో బాలికల కోసం మండలంలోని ధర్మవరం హైస్కూల్‌ను ప్లస్ ఫర్ గర్ల్స్ కళాశాల స్థాయిని కల్పించారు. 2022-23 విద్యాసంవత్సరం నుంచి తరగతుల నిర్వహణకు పూనుకున్నారు. కొత్తగా ఏర్పాటుచేసిన ఈ కళాశాలలో బాలికలను చేర్పించేందుకు విద్యాశాఖాధికారులు నానా తంటాలు పడ్డారు. ఇక్కడే చదవాలని పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన బాలికలకు టీసీలు ఇవ్వకుండా తిప్పిన విషయం విదితమే. ప్రజాప్రతినిధులతో కలిసి కొత్త కళాశాలతో భవిష్యత్ ఉంటుందని సమీపంలోగల జడ్పీ ఉన్నత పాఠశాలలతోపాటు ఊరూర తిరిగి అవగాహన కల్పించారు. ఇలా ఎన్ని ప్రయత్నాలు చేసినా గ్రామానికి ఒకరిద్దరు చొప్పున 12 మంది బాలికలను మాత్రమే చేర్చగలిగారు. వీరికి బైపీసీలో కూర్చో బెట్టి పాఠాలు బోధించారు. ప్రారంభం ఏడాదిలో ఒక్కరు కూడా వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత కాలేకపోయారు. ఉన్నతపాఠశాలలో పదోతరగతి వరకు బోధించిన ఉపాధ్యాయులతోనే పాఠాలు బోధించారు. వారికి ఇంటర్ పాఠ్యాంశాలను బోధించే నైపుణ్యం లేకపోవడంతో ఉత్తీర్ణతపై ప్రభావం పడింది. ఈ ఏడాది మాత్రం సంబంధిత పాఠ్యాంశంలో పీజీ డిగ్రీ ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను పీజీటీలుగా నియమించారు. వారికే విద్యార్థినులను చేర్పించే బాధ్యతను అప్పగించారు. 12 మంది బాలికల వరకు చేర్పించగలిగారు. ప్రథమ సంవత్సరంలో పరీక్షలు రాసిన వీరిలో ఐదుగురు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. కనీసం వసతులు లేకపోవడంతో ఉన్నత పాఠశాలలో సదుపాయాలు, ల్యాబ్‌లను వినియోగించుకోవల్సివస్తోంది. తక్షణమే అన్ని వసతులూ ఇక్కడ కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



ధర్మవరం ప్లస్ టూ గర్ల్స్ హైస్కూల్ (ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల)

హోం ఓటింగ్‌కు 29,174 దరఖాస్తులు

● వృద్ధులు, దివ్యాంగులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలి: కలెక్టరు నాగలక్ష్మి

కలెక్టరేట్, ఏప్రిల్ 16: జిల్లాలో అవసరమైన వారందరికీ హోం ఓటింగ్‌కు అవకాశాన్ని కల్పించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్‌లో భాగంగా హోం ఓటింగ్ విధానంపై ప్రిసైడింగ్ అధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 85 ఏళ్ల పైబడిన వృద్ధులకు, 40 శాతం కంటే ఎక్కువ వికలాంగత్వం ఉన్న విభిన్న ప్రతిభావంతులకు ఈ అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో భాగంగా కల్పించిన ఈ అవకాశాన్ని అర్హత ఉన్నవారు వినియోగించుకునేలా చూడాలన్నారు. దీని కోసం ఈనెల 22 వరకు పారం 12(డి) ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలో సుమారు 7181 మంది 80 ఏళ్ళు పైబడిన వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వికలాంగత్వం ఉన్న 21,993 మంది దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. మొత్తం 29,174 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి అర్హత ఉన్నవారితో ఈనెల 26 నాటికి తుది హోం ఓటింగ్ జాబితాను తయారు చేస్తామన్నారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, వీడియోగ్రాఫర్లు, మైక్రో అబ్జర్వర్‌తో పాటు బీఎల్‌వోలు, పార్టీల ఏజెంట్లు కూడా దరఖాస్తు దారుని ఇంటికి వెళ్ళి ఓటు తీసుకుంటారని తెలిపారు. దీని కోసం పార్టీ పాటించాల్సిన నిబంధనలను ప్రక్రియను వివరించారు. హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసిన వారికి పోలింగ్ బూత్‌లో కూడా ఓటు వేసే అవకాశం ఉందని ఆమె స్పష్టం చేశారు. ● ఈనెల 18నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందని, అభ్యర్థుల ఖాతాలో ఖర్చు లెక్కించేందుకు సిద్ధం కావాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. వ్యయనోడల్ అధికారులు ఆడిట్ అధికారులు అకౌంటింగ్ బృందాలతో కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గర నుంచి అతని ఖాతాలో ఖర్చు నమోదు చేయాలని ఆదేశించారు. ● ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 18న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అవుతుందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈనెల 25 నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, 29న ఉపసంహరణ, మే 13న పోలింగ్ జరుగుతుందని, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, డీఆర్‌వో అనిత, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు సందీప్ కుమార్, సుధారాణి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రూ.1.45 లక్షల నగదు పట్టివేత

బొబ్బిలి: స్థానిక పాతబొబ్బిలి జంక్షన్‌లో గల చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నిబంధనలకు విరుద్ధంగా నగదును తరలిస్తున్న వ్యక్తి నుంచి 1,45,500 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపారు. బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా పార్వతీపురం నుంచి విజయనగరం కారులో వెళ్తున్న వ్యక్తి అనుమతి లేకుండా నగదును తరలిస్తుండడంతో ఆ నగదును సీజ్ చేశామన్నారు. మధ్యవర్తుల సమక్షంలో సీజ్ చేసి జడ్పీ సీఈవోకు తదుపరి చర్యల నిమిత్తం పంపించినట్లు చదలవాడ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

విజయనగరం క్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 33 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు జీఆర్‌పీ ఇన్‌స్పెక్టరు వెంకటరావు తెలిపారు. ఎలక్షన్ ఎన్‌ఫోర్సుమెంటు కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు చేపడుతుండగా, ఫ్లాట్‌ఫాం నెంబరు 1లో మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలకు ఇద్దరు వ్యక్తులను తనిఖీలు చేయగా, గంజాయి పట్టుబడినట్టు తెలిపారు. అలాగే జీఆర్‌పీ ప్రత్యేక బృందాలు సహాయంతో విజయ నగరం, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస, అరకు రైల్వే స్టేషన్‌ల పరిధిలో ముమ్మ రంగా తనిఖీలు చేపడుతున్నామన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో పట్టుబడితే, జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జీఆర్‌పీ ఎస్ఐ రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు. ● వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో రైల్వేస్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, మహారాష్ట్రకి చెందిన వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ వెంకటరావు తెలిపారు. రైల్వేస్టేషన్ వద్ద ఎస్ఐ హరిబాబునాయుడు, సిబ్బంది తనిఖీలు చేపడుతుండగా, ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకుని బ్యాగులు తనిఖీ చేయగా, గంజాయి లభ్యమైందన్నారు. డిప్యూటీ తహశీల్దారుకు తెలియజేసి సీజ్ చేశామని, ఆ పట్టుబడ్డ మహారాష్ట్రకు చెందిన పింటూ అంబాదాస్ షిండేని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. మరో వ్యక్తి జువైనల్స్ అని తెలిపారు.



పట్టుబడిన గంజాయితో పోలీసులు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని చినమాదిగ వీధిలోగల ఓ ఇంటిలో 8 కిలోల గంజాయిని పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని చినమాదిగ వీధిలో గంజాయి నిల్వలు ఉన్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ సంతోషి, సిబ్బందితో కలిసి మంగళవారం అక్కడకు వెళ్లారు. అక్కడ నిడగంటి జ్యోతి అనే మహిళ ఇంట్లో 8 కిలోల గంజాయి ఉన్నట్లు నిర్ధారించారు. జ్యోతికి బొబ్బిలికి చెందిన నక్కా వెంకటేష్ అనే వ్యక్తి ఒడిసా రాష్ట్రంలోని సుంకి, సునాబేడా, కోరాపుట్‌ల నుంచి గంజాయిని తీసుకువచ్చి అమ్ముతున్నట్టు తెలుసుకున్నారు. జ్యోతి చిన్నపొట్లాల రూపంలో కట్టి రూ.100కు అమ్ముతున్నట్టు గ్రహించారు. కర్ణాటక రాష్ట్రం నాగులాపురానికి చెందిన లూహిత్ అనే వ్యక్తి జ్యోతి వద్ద గంజాయి కొనుగోలు చేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

సారాతో వ్యక్తి అరెస్టు

కొమరాడ: గుమడ గ్రామానికి చెందిన బొత్స మధుసూదనరావు కళ్లికోట గ్రామం దగ్గర సారా అమ్ముతుండగా కొమరాడ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కళ్లికోట సమీపంలో సుమారు 200 సారా ప్యాకెట్లతో మధుసూదనరావును అరెస్టు చేసినట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు.

● **నెల్లిమర్ల:** సతివాడ గ్రామ శివార్లలో అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ డి.రామగణేష్ తెలిపారు. నిందితుని వద్ద ఉన్న 38 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

25 నుంచి వేసవి శిక్షణ శిబిరం

రాజాం రూరల్: రాజాంలో ఈనెల 25 నుంచి జూన్ మూడో తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు బాలభ వన్ డైరెక్టర్ సుంకరి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భరత నాట్యం, కూచిపూడి, శాస్త్రీయ సంగీతం, చిత్ర లేఖనం, తబలాలో చిన్నారులకు ఉచితంగా శిక్షణఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ శిక్షణ జరుగుతుదని తెలిపారు. ఆసక్తి కలవారు 99598 10811ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు

మొక్కుబడిగా మండల సమావేశం

రామభద్రపురం: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మొక్కుబడిగా ముగిసింది. మండల అధ్యక్షుడు చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం ఎటువంటి చర్చలు లేకుండా నే సాగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో చర్చలు జరపకూడదని ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలిపారు. దీంతో ఎటువంటి అజెండా లేకుండా ఈ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో జడ్పీటీసీ అప్పికొండ సరస్వతమ్మ, ప్రజా ప్రతినిదులు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 16: నగరంలోని కొత్తపేట, కోదండ రామాలయంలో ఏటా నిర్వహిస్తున్న విధంగానే ఈ ఏడాది కూడా శ్రీరామనవమి ఉత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం ఆరు గంటలకు సుప్రభాత సేవ అనంతరం, స్వామి వారికి అభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం స్వామి వారి తిరువీధి ప్రదర్శన నిర్వహించనున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలో గురువారం (ఈనెల 18న)ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ఎపీఈపీడీసీఎల్ సహాయ ఇంజనీర్ ఆర్.రవికుమార్ తెలిపారు. ఎపీఈపీడీసీఎల్ ఆపరేషన్ ఈఈ జి.సురేష్ బాబు ఆదేశాల మేరకు 33కెవి అదనపు వర్కు విస్తరణ పనులు చేస్తున్నామన్నారు. దీని కారణంగా విద్యుత్ సరఫరాను ఈ సమయంలో నిలిపేస్తున్నామన్నారు.

పోస్టల్ కార్యాలయం మార్పు

రాజాం: రాజాంలోని శ్రీకాకుళం రోడ్డులోని సూర్య దుర్గ కల్యాణ మండపం సమీపంలో గల పోస్టల్ కార్యాలయాన్ని మార్చినట్లు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముఖరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతకాలంగా ఇరుకు గదుల్లోనే నిర్వహిస్తుండ డంతో వినియోగదారులకు ఇబ్బందులు కలుగతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని నారాయణ స్కూల్ దగ్గరకు మార్చినట్లు తెలిపారు.

హౌస్ ఓటింగ్‌పై అవగాహన

జామి: రాబోయే ఎన్నికల్లో హౌస్ ఓటింగ్ విధానంపై ఏఈఆర్‌వో రాంబాయ్ మండలంలోని బీఎల్‌వోలకు, సెక్టార్ ఆఫీసర్స్‌కు మంగళవారం కార్యాల యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జామి, గజపతినగరం నియోజకవర్గ పరిధిలో ఉన్నవారు పాల్గొన్నారు.

పకడ్బందీగా అభ్యసన సాధనా పరీక్ష

రామభద్రపురం: రాష్ట్ర అభ్యసనా సాధనా పరీక్షను మంగళవారం నాయుడువలస ప్రాథవికోన్నత పాఠశాలలో నిర్వహించారు. సీఆర్‌పీ ఉమా ఆధ్వర్యంలో ఈ పరీక్షను నిర్వహించారు. శ్లాష్ పరీక్షకు గానూ పాఠశాలలో నాలుగో తరగతిని ఎంపిక చేసి ఆంగ్లం, తెలుగు సామర్థ్యాల సాధనను మదింపు చేశారు. తెలుగు, ఆంగ్లం, గణితంలో విద్యార్థుల అభ్యసనా స్థాయిల మదింపునకు, సామర్థ్యాల పెంపునకు, భవిష్యత్ ప్రణాళిక రూపొందించడానికి ఈ సర్వే ఉపకరిస్తుందని అన్నారు.


లైజనింగ్ అధికారుల నియామకం

కలెక్టరేట్: జిల్లాలోని సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల కమిషన్ నియమించిన జనరల్, ఎక్స్‌పెండిచర్ పరిశీలకులకు లైజనింగ్ అధికారులను నియమిస్తూ కలెక్టరు నాగలక్ష్మి ఆదేశాలు ఇచ్చారు. గజపతినగరం, నెల్లిమర్ల, విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గాలకు జనరల్ పరిశీలకులగా ఉన్న హనిష్ చాబ్రాకు, జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావును లైజనింగ్ అధికారిగా నియమించారు. ఎచ్చర్ల, రాజాం, బొబ్బిలి, చీపురుపల్లి నియోజకవర్గాలకు పరిశీలకులగా ఉన్న తలట్ పర్వీజ్‌కు గ్రౌండ్‌వాటర్ డిప్యూటీ డైరక్టరు ఎన్‌వికె దుర్గాప్రసాద్‌ను లైజనింగ్ అధికారిని నియమించారు.

‘ప్రజాగళం’ సక్సెస్‌తో జోష్

● బాబు పర్యటనతో రాజాం టీడీపీలో నూతనోత్సాహం

రాజాం రూరల్/(విజయనగరం-ఆంధ్రజ్యోతి): రాజాంలో సోమవారం నిర్వహించిన ప్రజా గళం కార్యక్రమం సక్సెస్ కావడంతో క్యాడర్‌లో జోష్ నెలకొంది. ఈసందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కార్య కర్తల్లో ఉత్సాహం నింపారు. పట్టణంలోని నిర్వహించిన రోడ్‌షోకు వేలాదిగా తరలివచ్చారు. చంద్రబాబునాయుడు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు వివరిస్తున్నంతసేపు యువకులు కేరింతలు కొట్టారు. రెండు కిలోమీటర్ల మేర ఇసుక వేస్తే నేలపై రాలనంతగా జనం తరలొచ్చారు. అధికారంలోకి రాగానే రాజాం-డోలపేట రహదారిని అభివృద్ధిచే యడంతో పాటు రాజాం ప్రాంతానికి సంబందించిన సమస్యలపై వరాల జల్లు కురిపించడంతో హర్షధ్వానాలతో సభాప్రాంగణం మార్మోగిపోయింది. ఇక్కడ పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా పనిచేసిన కంబాల జోగులు రాజాంకు ఏంచేశాడని బాబు ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే తొలిసంతకం మెగా డీఎస్సీపైనే చేస్తానని చంద్రబాబు ప్రకటించి నిరుద్యోగుల మనసు గెలుచుకున్నారు. సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న సమయంలో జై చంద్రబాబు అన్న నినాదాలు మహిళల నుంచి మిన్నంటాయి. చంద్రబాబు రాజాం పర్యటన టీడీపీ శ్రేణుల్లోనే కాకుండా మహిళలు, నిరుద్యోగులు, యువత, మద్యం ప్రియులు, తటస్థుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ఎండను సైతం లెక్కచేయకుండా వేలాది మంది తరలిరావడం విశేషం. సాయంత్రం నాలుగు గంటల సమయంలో వేలాదిమంది తరలిరావడంతో వారిని పోలీసులు కూడా అదుపు చేయలేకపోయారు. బారికేడ్లను సైతం విరగ్గొట్టి బాబును చూసేందుకు సభాస్థలికి పరుగులు తీశారు. వేలాదిగా తరలివచ్చి కార్యక్రమం విజయవంతం కావడంతో రాజాం నియోజకవర్గ వైసీపీవర్గాల్లో ఆందోళన నెలకొంది. ప్రజాగళం యాత్రకు వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపారు. ఈ సభకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. జనాన్ని చూసిన చంద్రబాబు ఉత్సాహంగా ప్రసంగించారు. కార్యకర్తలను నాయకులుగా తీర్చి దద్దటం టీడీపీకి మాత్రమే సాధ్యమన్నారు. స్థానిక సమస్యలను ప్రస్తావించడం... వాటికి స్పష్టమైన హామీలు ఇస్తున్నపుడు ప్రజల నుంచి చప్పట్లతో స్పందన లభించింది. ఎన్‌డీఏ కూటమికి వేసిన ఓటు వృథాగా పోదని... అభివృద్ధి, సంక్షేమం, సుస్థిర పాలనకు బాటలు వేస్తుందని అన్నారు. ‘రాజాం - పాలకొండ రోడ్డు దుస్థితిని చూశాను. స్వయంగా నడిచాను. ఇంత దారుణంగా ఉంటే ప్రభుత్వం ఏం చేస్తోంద'ని ప్రశ్నించారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు.



రాజాం ప్రచారంలో మాట్లాడుతున్న చంద్రబాబు

● హామీలపై స్పష్టత

వైసీపీ ప్రభుత్వం సెంటు స్థలం అందించి... నివశించేందుకు వీలులేని విధంగా ఇళ్లు ఇచ్చింది. దీనిని గుర్తించిన చంద్రబాబు తాము అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ప్రకటించారు. దీంతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇళ్ల నిర్మాణం కోసం కేంద్రం ఇచ్చే నిధులతో పాటు మరికొంత మొత్తాన్ని కేటాయిస్తామని ప్రకటించారు. బీజేపీ ప్రకటించిన ఎన్నికల హామీలను ప్రస్తావించారు. ఉచిత బియ్యం పంపిణీని మరో ఐదేళ్ల పాటు కొనసాగించనున్నట్టు ప్రస్తావించారు. 25 వేల పోలీసు ఉద్యోగాల భర్తీ, మెగా డీఎస్సీ, పింఛను రూ.4 వేలకు పెంపు తదితర అంశాలను ప్రస్తావించినపుడు జనం పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇలా చంద్రబాబు పర్యటన అన్ని వర్గాల్లోనూ నూతనోత్సాహాన్ని నింపింది.

పంచాయతీ కార్యదర్శులకు వర్క్‌షాపు

బొబ్బిలి, ఏప్రిల్ 16: స్థానిక మండలపరిషత్ సమావేశపు హాలులో మంగళవారం బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గల నాలుగు మండలాల పంచాయతీకార్యదర్శులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకురాలు సుప్రియ మాట్లాడుతూ పంచాయతీల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాల అమలుపై అవగామన కల్పించారు. హరితరాయబారులకు, సర్పంచ్‌లకు వేతనాలు, విద్యుత్ చార్జీలు చెల్లింపులకు ప్రభుత్వం నిధులు సమకూర్చుతోందన్నారు. పంచాయితీ నిధులతో మౌలికసదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, వెంకరమణ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఇన్నాళ్లకు దళితులకు న్యాయం

విజయనగరం దాసన్నపేట: వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుతో సహా ఆరుగురు నిందితులకు న్యాయస్థానం 18 నెలల జైలు శిక్షతో పాటు జరిమానా విధించడంపై హర్షం వ్యక్తం చేసినట్టు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు డోకా రమేష్ తెలిపారు. మంగళవారం ప్రజా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాయస్థానం ఐదుగురిని దోషులుగా తేల్చి... జైలు శిక్ష ఖరారు చేయడంతో దళితులకు న్యాయం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు సంతోష్, అప్పారావు, బుల్లయ్య, మాదవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

బొబ్బిలి, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు హోం ఓటింగ్‌ను పగడ్బందీగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, స్థానిక ఆర్డీవో ఎ.సాయిశ్రీ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం సెక్టార్ అధికారులు, బీఎల్‌వోలకు ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్నదని, నాటి నుంచి అన్ని రోజులు చాలా కీలకమైనవన్నారు. సెక్టార్ అధికారులు, ఇతర సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలను సరిచూసుకోవాలన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని, వారంతా ఓటు వేసేందుకు క్యూలైన్లతో పనిలేదని, వారు నేరుగా ఓటు వేసుకునే వెసులుబాటు ఉన్నందున అందరూ సహకరించాలన్నారు. నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆర్డీవో అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు త్రినాథరావునాయుడు, రాజారావు, సులోచన, ఎన్నికల డీటీలు రెడ్డి సాయికృష్ణ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

నామినేషన్ల స్వీకరణకు పక్కా ఏర్పాట్లు

చీపురుపల్లి: ఎన్నికల గజిట్ నోటిఫికేషన్ వెలువడనున్న రోజు నుంచి నామినేషన్లు స్వీకరించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఆర్డీవో, చీపురుపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.శాంతి తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించామన్నారు. 18 నుంచి 25వ తేదీ వరకూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. ప్రభుత్వ సెలవు దినాల్లో నామినేషన్లు తీసుకోవడం జరగదన్నారు. 26న నామినేషన్ల పరిశీలన ఉంటుందని చెప్పారు. ఒకే రోజున ఒకటి కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు నామినేషన్లు సమర్పించాలనుకుంటే, వారికి వేర్వేరు సమయాలు కేటాయిస్తామన్నారు. శాంతిభద్రల సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలు తమకు పూర్తి సహకారం అందించాలని ఆమె కోరారు. అనంతరం సెక్టార్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చీపురుపల్లి తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు, ఎన్నికల డీటీ బి.సురేష్, హెచ్‌డీటీ సంతోష్, నాలుగు మండలాల సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో శాంతి

వైభవంగా సీతారాముల శోభాయాత్ర

● బొబ్బిలిలో ఆకట్టుకున్న బండ్లవేషాలు, ప్రదర్శనలు

బొబ్బిలి, ఏప్రిల్ 16: శ్రీరామనవమి పండుగను సందర్భంగా బొబ్బిలి పట్టణంలో పూల్‌బాగ్ డోలాయాత్ర మండపం నుంచి మంగళవారం రాత్రి సీతారామ చంద్రమూర్తి ఉత్సవమూర్తులతో శోభాయాత్రను అత్యంత కన్నులపండువగా నిర్వ హించారు. ఆర్ఎస్ఎస్, హిందూఉత్సవసమితి సంయుక్త ఆధ్వర్యంలో శోభాయా త్రను నిర్వహించారు. మేళతాళాలు, విద్యుత్ కాంతుల వెలుగుల్లో బళ్లవేషాలు, నాగసాధువుల ప్రదర్శనలు, జానపద వేషాల ప్రదర్శనలతో పట్టణంలోని ప్రధాన వీధుల్లో నిర్వహించిన శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయనతో పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవసమితి ప్రతినిధులు పువ్వల శ్రీనివాసరావు, పెంట స్వామినాయుడు, గెంబలి శ్రీనివాసరావు, చెలికాని కేశవ, రమేష్, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పారిశుధ్య కార్మికుల కాలనీలో గల శ్రీరామభక్తసంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకల కోసం మంగళవారం సాయంత్రం ఘనంగా శోభాయాత్ర చేపట్టారు. చినబజారు సెంటరులో గల శ్రీరామమందిరంలో కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాల కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆకట్టుకున్న బళ్లవేషాలు



ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

ఆనాడు కోడికత్తి.. నేడు గులకరాయి

● టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు



ప్రచారంలో మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు

విజయనగరం రూరల్: రాష్ట్రంలో రాజకీయాలు దిగజారాయని, అందుకు నిదర్శనం.. అనాడు కోడికత్తి డ్రామా.. నేడు గులకరాయి డ్రామా వీటి గురించి ప్రజలు ఆలోచన చేయాలని టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులు కలిశెట్టి అప్పలనాయుడు, అదితి గజపతిరాజుకు మద్దతుగా విజయనగరం నియోజకవర్గ టీడీపీ ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గొడ్డలితో చంపిన వ్యక్తి ఎవరన్నది తెలిసినా.. వాటి గురించి మాట్లాడకుండా, కోడికత్తి, గులకరాయి డ్రామాలు ఆడుతున్నారన్నారు. ఎన్‌డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో సమస్యలు పట్ల అవగాహన ఉందన్నారు. అదితి గజపతిరాజు మాట్లాడుతూ, నగరంలో బొమ్మలు, రంగు, రంగుల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తే అభివృద్ధి కాదన్నారు.

● విజయనగరం నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు వున్నాయన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కోలగట్ల కృషి చేయలేదన్నారు. గంజాయి పట్టుబడడం, కేసులు వంటివి విజయనగరంలో వుండడం ఆవేదన కలిగించిందన్నారు. యువత భవిష్యత్తునాశనం అవుతున్నదన్నారు. ఐదేళ్ల కాలంలో రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్లిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే విజన రీ నాయకుడు చంద్రబాబు ఉండాలన్నారు. జనసేన నాయకురాలు పాలవలస యశస్వి, బీజేపీ నాయకుడు ఇమంది సుధీర్, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, గాజులరేగ టీడీపీ నాయకులు కర్రోతు నర్సింగరావు, నడిపిల్లి రవికుమార్, పత్తిగిల్లి సూర్యకుమారి, కర్రోతు రాదామణి, గడి శ్రీను, గార సత్యనారాయణ, సియ్యాదుల ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

రామభద్రపురం: ఎన్నికలు ప్రశాంత వాతావర ణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించా లని బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు కోరారు. బూసాయవలస, ముచ్చర్లవలస గ్రామాల్లో సమా వేశాలు ఏర్పాటు చేశారు. ఈ సమావేశాల్లో ఎస్ఐ జ్ఞానప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరిబోండాలపై శ్రీరామ నామాలు



అలంకరించిన కొబ్బరి బోండాలను అందజేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రామతీర్థంలో ఈ నెల 17న జరుగనున్న వేడుకలు, సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించేందుకు తూర్పు గోదావరి జిల్లా మండపేటకు చెందిన భక్తుడు శ్రీరామ నామాలతో అలంకరించిన కొబ్బరి బొండాలను రామతీర్థం సేవా సంఘ ప్రతినిధుల ద్వారా దేవస్థానం ఈఓ వైశ్రీనివాసరావుకు, అర్చకులకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘ ప్రధాన కార్యదర్శి సుదర్శనం విజయ్ కుమార్, అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్ కుమార్, నరసింహాచార్యులు, పవన్ కుమార్, రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలి

● సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: అగ్ని ప్రమాదాల నివారణ పద్ధతులపై ప్రజలు అవగాహన కలిగి ఉం డాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి తెలిపారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలు పురస్కరించుకుని నివారణా పద్ధతులను తెలిపే కరపత్రాన్ని పీవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు.అగ్నిమాపకకేంద్రం ల్యాండ్‌లైన్ 08941-260111 అందరికీ తెలిపే విధంగా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులు పూర్తి చేయాలి: డీఈవో



వండువ పాఠశాలలో సర్వే పరిశీలిస్తున్న డీఈవో పగడాలమ్మ

వీరఘట్టం: నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి డీఈవో ఎస్.పగడాలమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని బిటివాడ గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాల నాడు-నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనందరావు, హెచ్‌ఎం రజని పాల్గొన్నారు.

స్టేట్‌లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే

వీరఘట్టం మండలంలోని పది పాఠశాలల్లో నాలుగో తరగతి విద్యార్థులకు స్టేట్‌లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే మంగళవారం నిర్వహించారు. తెలుగు, గణితం, ఆంగ్లంపై నిర్ణీత సర్వే ఫారంపై విద్యార్థులను పరీక్షించారు. డీఈఓ పగడాలమ్మ మండలంలోని వండువ, బిటివాడ, తెట్టంగి, తలవరం పాఠశాలల్లో విద్యార్థులు సర్వే పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనందరావు సిబ్బంది పాల్గొన్నారు.

కొలతలు ఇచ్చి పనులు చేయించాలి: ఎంపీడీవో



మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యనారాయణ

గరుగుబిల్లి: ఉపాధి వేతనదారులకు ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందేలా ముందస్తు కొలతలు ఇచ్చి పనులు చేయించాల్సి ఉందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.సూర్యనారాయణ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గరుగుబిల్లి, పెద్దూరు, శివ్వాం గ్రామాల మేట్లుకు ఏపీవో మండల గౌరీనాథ్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారుల హాజరును ఎన్‌ఎంఎస్ యాప్‌ద్వారా ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. వేతనదారులు సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సహాయకులు ఎం.భూలక్ష్మి, ఎం.ఉమామహేశ్వరి, క్షేత్ర సహాయకులు ఎం.రాధ, టి.చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాములోరి కల్యాణం



మక్కువలో ముస్తాబవుతున్న శ్రీసాయి రామలింగేశ్వర ఆలయం

సాలూరు రూరల్: శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం డబ్బీవీధి, మెంటాడ వీధి, వెలమపేట, గాడి వీధి, నెయ్యిల వీధి, వేంకటేశ్వర కాలనీ, పెదకోమటిపేట రామాలయం, మామిడిపల్లి తదితర చోట్ల సీతారాముల కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్టు కమిటీలు మంగళవారం తెలిపాయి. శ్రీరామ నవమి వేడుకలకు రామ మందిరాలను ముస్తాబు చేశారు. భక్తులకు శ్రీరామ దర్శనానికి ఏర్పాట్లు చేశారు.

●**మక్కువ:** మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీసీతారాముల కళ్యాణ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కళ్యాణ వేడుక ఘనంగ ఆనిర్వహించేందుక శ్రీరామాలయాలను ముస్తాబు చేశారు. మండలంలోని మక్కువ, కన్నంపేట, శంబర, చెముడు గ్రామాల్లో కళ్యాణాన్ని నిర్వహించడంతో పాటు అన్న ప్రసాద వితరణ కార్య క్రమాన్ని చేపట్టనున్నారు. వేద మం త్రోచ్ఛరణల మధ్య శ్రీరాములోరి కళ్యాణం వైభవంగా బుధవారం జరగనుంది.

సీతంపేటలో వర్షం

సీతంపేట: సీతంపేటలో మంగళవారంసాయంత్రం వర్షం కురిసింది. వారం రోజులుగా ఎండ తీవ్రతకు ప్రజలు అల్లాడిపోయారు. ఈతరుణంలో కురిసిన వర్షంతో ఉపశమనం లభించింది. అయితే ఈ వర్షం వల్ల జీడి పిక్కలు రంగుమారి మచ్చలుగా ఏర్పడి ధర తగ్గిపోయే అవకాశం ఉంటుందని గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు.

ధ్యానం ముక్తికి మార్గం

ఒడిశా



ధ్యానం చేస్తున్న మహిళలు

రాయగడ: ధ్యానం ముక్తికి మార్గమని ధ్యానంతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ధృడత్వం కలుగుతుందని ప్రముఖ ధ్యాన శిక్షణ గురువు రెడ్డి త్రినాధరావు (పార్వతీపురం వాస్తవ్యులు) అన్నారు. మిషన్ ఆఫ్ శ్రీరామచంద్ర సంస్థ దేశంలో పలు చోట్ల ధ్యానకేంద్రాలు ఏర్పాటుచేసి శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా రాయగడలో మంగళవారం ధ్యాన శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవితపు ఒత్తిళ్ల నుంచి ధ్యానం శాంతిని, శక్తిని, ఆరొగ్యాన్ని ఇస్తుందన్నారు. అందుకే ప్రతిఒక్కరూ ధ్యానం అలవాటు చేసుకుని ప్రశాంతంగా ఉండాలన్నారు. ఆయన ప్రతి ఆదివారం పార్వతీపురం నుంచి వచ్చి శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి, 8.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు.

శ్రీరామ నవమి వేడుకలకు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న పద్మనాభదాస్

రాయగడ: శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు శ్రీరామ నవమి ఉత్సవ కమిటీవారు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. కమిటీ చైర్మన్ సీనియర్ న్యాయవాది బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పద్మనాభదాస్ అధ్యక్షతన జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు జగన్నాథ మందిరం సమీపంలోని శ్రీరామాలయం నుంచి భారీ ఊరేగింపు జరగనుందని తెలిపారు. ఈ ఊరేగింపులో సుమారు 5 వేలమంది భక్తులు పట్టణ వీధుల గుండా సాగి కపిలాష్ కూడలి మీదుగా శ్రీరామనగర్ రామలింగేశ్వర ఆలయం, అక్కడ నుంచి బాలాజీనగర్ కళ్యాణ వేంకటేశ్వర ఆలయం వద్ద ముగస్తుంది. అక్కడ అన్ని ఆలయాల పూజారులను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్యామకుమార్‌దాస్, విద్యాభూషణ్ పండా, అజయ్‌కుమార్, పి.కృష్ణ పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా.. పనులు జరగక

●వాహనచోదకులకు తప్పని అవస్థలు

●ఇదీ సీతానగరానికి ఆనుకుని ఉన్న రహదారుల దుస్థితి

సీతానగరం: సీతానగరానికి ఆనుకుని అనుసంధానమైన పలు రహదారులు అధ్వానంగా మారాయి.ఐదేళ్లగా ఈ రహదారుల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అవస్థలు పడుతున్నామని వాహనచోదకులు, ప్రయాణికులు వాపోతున్నారు.ఈనేపథ్యంలో పలు రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు అధికారులు ప్రకటించినా పనులు జరగకపోవడంతో వాహనచో దకులకు అగచాట్లు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి

●సీతానగరం అజ్జాడ రహదారి అడుగడుగునా గోతులమయం కావడంతో గతఏడాది వర్షాకాలంలో పలు చోట్ల చెరువును తలపించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఈ రహదారి వెంటనే అభివృద్ధి చేయా లని ఎమ్మెల్యే జోగారావుకలెక్టర్‌కు అప్పట్లో వినతిపత్రం అందించారు. 48 గంటల్లో పనులు చేపట్టకపోతే మోకాళ్లపై నిలబడి తమ నిరసన తెలుపుతానని హెచ్చరించారు. రోడ్లు భవనాలశాఖ స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్న విషయం విదితమే. నేటికి ఈ రహదారి పరిస్థితి అలాగే ఉంది.



అధ్వానంగా ఉన్న చినబోగిలి నుంచి మక్కువ వైపు వెళ్లే రహదారి

●చినబోగిల నుంచి మక్కువరహదారి విస్తరణ పనులు అసంపూర్తిగా మిగలడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. రెండు వరసల రహదారిగా నిర్మించేందుకు తామరఖండి, బగ్గం దరవలసలో ఇళ్లను కూల్చి కాలువలు నిర్మించి వదిలేశారు. కనీసం కాలువలపై పైకప్పులు వేయకపోవడంతో కాలువలు దాటే సమయంలో వృద్ధులు, చిన్నారులు రాత్రి వేళల్లో ప్రమాదాలకు గుర వుతున్నారు. ఈ నేపథ్యంలో పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో దుమ్ము, ధూళి చెలరేగి వ్యాధుల బారిన పడుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు.

●చినభోగిల కూడలి నుంచి బక్కుపేట గ్రామానికి రెండు కిలోమీటర్ల రహదారిని పదేళ్ల కిందట నిర్మించారు. ఆతర్వాత నిర్వహణ లేకపోవడం తో అధ్వానంగామారింది.గోతులమయంకావడంతో ద్విచక్ర వాహనాలపై రాకపోకలకు అవస్థలు తప్పడంలేదని పలువురు వాపోతున్నారు.

● ఏగోటివలస నుంచి గాదెవలస గ్రామానికి 15 సంవత్సరాల కిందట ఐదు కిలోమీటర్ల రహదారిని నిర్మించారు. రహదారి పూర్తిగా పాడవడంతో గత ఏడాది రహదారి అభివృద్ధి నిధులు మంజూరు చేశారు. గత ఏడాది జూలైలో ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆరు నెలల కిందట రాళ్లు, రాతి బుగ్గి పరిచి చదునుచేసి వదిలేశారు.



గోతులమయమైన సీతానగరం నుంచి అజ్జాడ వైపు వెళ్లే రోడ్డు

చెల్లింపుల్లో జాప్యం

చినభోగిల నుంచి మక్కువ రహదారికి చెల్లింపుల్లో జాప్యం జరగడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారని ఆర్‌అండ్‌బీ ఏఈ రామ్మోహనరావు తెలిపారు. సీతానగరం నుంచి అజ్జాడ రహదారికి నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.



సాలూరు: గాంధీనగర్‌లో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు, సిబ్బంది



పార్వతీపురంటౌన్: గ్యాస్ ప్రమాదాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



పాలకొండ:అగ్ని ప్రమాదాలపై వివరిస్తున్న అగ్నిమాపక అధికారి

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

● వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన

అగ్ని ప్రమాదాలపై అ ప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారులు కోరారు. మంగళవారం అగ్ని మాపక వారోత్సవాలు పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవల్సిన జా గ్రత్తలను వివరించారు.

● పాలకొండ: పట్టణంలోని శ్రీసాయిశంకర్ అపార్ట్‌మెంట్‌లోని అగ్ని ప్రమాదాలపై ఈ శాఖ అధికారి సర్వేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో జనార్దనరావు, లక్ష్మీనారాయణ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

● **పార్వతీపురంటౌన్:** అగ్ని ప్రమాదాలపై నిర్లక్ష్యాన్ని వీడి ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలని పార్వతీపురం అగ్నిమాపక అధికారి పైడిరాజు సూచించారు.పట్టణంలో వాటర్‌మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇళ్లల్లో గ్యాస్ ప్రమాదా లు, షార్ట్ సర్క్యూట్ వంటివి మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని చెప్పారు.

● **సాలూరు:** మహిళలు అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సాలూరు అగ్నిమాపక అధికారి ఉప్పాడ సూధాకర్‌రావు కోరారు. పట్టణంలోని గాంధీనగర్‌లో మహిళలకు అవగాహన కల్పించారు.

వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యం: జగదీశ్వరి



గుమ్మలక్ష్మీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న జగదీశ్వరి, టీడీపీ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: వైసీపీ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి శూన్యమని కురుపాం నియోజకవర్గ టీడీపీఅభ్యర్థి జగదీశ్వరి ఆరోపించారు. మంగళవారం గుమ్మ లక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ కొండ శిఖర గ్రామాలకు రహదారులు నిర్మించలేదని ఆరోపించారు.ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి రెండుసార్లు గిరిజన ఓట్లతో గెలిచినా ఈ ప్రాంతంలో ఏ మాత్రం అభివృద్ధికి కృషి చేయలేదని ఆరోపించారు. టీడీపీరాష్ట్ర కార్యదర్శి కురుపాంరాజా వీరేష్‌దేవ్ మాట్లాడుతూ ఎమ్మెలే, ఎంపీఅభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో కూటమి నాయకులు దొంకాడ రామకృష్ణ, కోలా రంజిత్, కృష్ణబాబు, పాడి సుధా, మండంగి భూషణ, వెంపటాపు భారతి, తమ్మయ్య, బిడ్డిక పద్మ, కళావతి, మాజీ ఎంపీపీ రమణమూర్తి పాల్గొన్నారు. కాగా గుమ్మలక్ష్మీపురం నుంచి భద్రగిరి వరకు ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనకు ఓటు వేయాలని ఆమె కోరారు.

● **గరుగుబిల్లి:** సంతోషపురం పంచాయతీ పరిధిలోని ఖడ్గవలస, పిట్టలమెట్ట గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. సర్పంచ్ అంబటి తవిటినాయుడు, కోట భరత్ కుమార్, కురుపాం ఎస్సీ సెల్ అధ్యక్షురాలు వెంపటాపు భారతి ఆధ్వర్యంలో వీరుపార్టీలో చేరారు.

●**కొమరాడ:** మాదలంగిలో ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ ఉదయశేఖర్ పాత్రుడు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్‌తో పాటు

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా: జయకృష్ణ

భామిని:తనకు ఒక్కసారి ఇవ్వాలని, అభివృద్ధి చేస్తానని పాలకొండ నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ తెలిపారు.మంగళవారం మండలంలోని బిల్లుమడ, నులకజోడు, సింగిడిల్లో ప్రచారంనిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచినీటి సమస్య లేకుండా చర్యలుతీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నిమ్మల నిబ్రం, బి.రవినాయుడు, ఎం.జగదీశ్వరరావు, బి.ఆనందరావుఆర్.కిరణ్, సూర్యారావు, కాశీరావు, కాంతారావు, సాకేటి రామారావు పాల్గొన్నారు.



ప్రచారంలో మహిళలతో మాట్లాడుతున్న జయకృష్ణ

అభివృద్ధికి నోచుకోని అరకు

సాలూరు:అరకు పార్లమెంట్ ప్రాంతమంతా ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురయ్యిందని ఇండియా కూటమి అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనరస అన్నారు. పట్టణంలో మంగళవారం ఆయన ప్రచారం చేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ చేసి, గాంధీనగర్ చేరుకుని అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగానే అరకు పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. కార్యక్రమంలో గెడెల రామకృష్ణ, సిగడాపు బంగారయ్య, ఎన్‌వై.నాయుడు, రాకోటి రాములు, తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గ పాలనకు స్వస్తి పలకాలి

● సాలూరు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి



సాలూరులో టీడీపీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న సంధ్యారాణి

సాలూరు: రాష్ట్రంలో దుర్మార్గపు పాలనకు స్వస్తి పలికి చంద్రన్నకు స్వాగతం పలకాలని సాలూరు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. మీ ఇంటి ఆడపిల్లగా ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి అంటే ఎంటో చూపిస్తానని తెలిపారు. పట్టణంలోని రెండు, ఐదో వార్డుల్లో ఆమె మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు,మోహన్, సత్యవతి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో విజయచంద్ర ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రంలోని మూడో వార్డులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు జి.రవికుమార్ ఆధ్వర్యంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కొత్తపల్లి గీతకు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, టీడీపీ నాయకులు డా.చీకటి బద్రి నారాయణరావు, బార్నాల సీతారాం, మజ్జి వెంకటేష్, కౌన్సిలర్లు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మిగులు సీట్లకు 19న కౌన్సెలింగ్

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో మిగిలిన సీట్లకు ఈ నెల 19న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.సంధ్యారాణి తెలిపారు. మంగళవారం గరుగుబిల్లిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు. మిగులు సీట్ల భర్తీ కోసం ఈ నెల 19న చీపురుపల్లిలోని బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమ వుతుందని సంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు ఆధార్ కార్డు, కుల ధ్రువీ కరణ పత్రం, ఆదాయ పత్రం, స్టడీ సర్టిఫికెట్ తదితర పత్రాలతో హాజరు కావాలని కోరారు.

దావాసమను

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్యసముఖమునకు.

O.S.No.43/23

Between:

శ్రీ రవ్వా లక్ష్మి ...... వాది

And

1. శ్రీ కట్టమూరి ఈశ్వరరావు
2. శ్రీమతి కట్టమూరి సీతామహాలక్ష్మి

...... ప్రతివాదులు

To

1. శ్రీ కట్టమూరి ఈశ్వరరావు, వ 40 సం॥, S/o లేటు అప్పలరాజు, మెయిన్‌రోడ్, చర్చిగుడి దరి, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా.
2. శ్రీమతి కట్టమూరి సీతామహాలక్ష్మి, వ 35సం॥, W/o ఈశ్వరరావు. -Rest-Do-

పై నెంబర్ దావాను వాది మీపై ప్రోనోటు బాకీ రాబట్టు నిమిత్తం పైకోర్టులో పై నెంబరు దావా దాఖలు చేయగ సదరు దావాలో కోర్టువారు మీ ఉభయుల్కు ఎన్ని పర్యాయములు సమన్సు పై కోర్టు నుండి పంపించినప్పటికీ ఉద్దేశ్యపూర్వకంగా సమన్లు తీసుకొనందున పై నెంబరు దావాలో కోర్టువారు పేపరు పబ్లికేషను ద్వారా సమను సర్వీసు అయ్యేలాగ ఆర్డరు జారీ చేసిరి. సదరు దావాలో మీ యొక్క హాజరు నిమిత్తం తే:23-04-2024 నాటికి వాయిదా అయి వున్నది. సదరు వాయిదా నాడుదయం 10.30ని॥లకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు అయి మీ యొక్క అక్షేపణలు ఉన్న యెడల కోర్టువార్కి తెలియజేయడమైనది. లేని యెడల మీ పరోక్ష మందు తీర్పు వెలువరించగలరని యిందుమూలముగా మీకు తెలియచేయడమైనది.

సాలూరు,
తే:16-04-2024

రేగు సూర్యనారాయణ
వాది తరుపు న్యాయవాది, సాలూరు
ఫోన్: 8247861677, 7382071863

రాష్ట్రానికి సమర్థ నాయకుడు అవసరం: అదితి

విజయనగరం రూరల్: రాష్ట్రానికి చంద్రబాబు వంటి సమర్థ నాయకుడు అవసరమని కూటమి అభ్యర్థి అదితి గజపతి రాజు కోరారు. గాజులరేగ ప్రాంతానికి చెందిన మాజీ కౌన్సిలర్ గార సత్యనారాయణ, గార ఉమ, కఠారి శ్రీనివాసులు, గేడు సూర్యనారాయణతో పాటు 300 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరిని ఆమె పార్టీలోకి ఆహ్వానించారు. నగరంలోని 26, 10 డివిజన్లకు చెందిన కొందరు టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, పిళ్లా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియను విజయవంతం చేయండి

రాజాం: నామినేషన్ ప్రక్రియను విజయవంతం చేసేలా అందరూ సహకరిం చాలని టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ కోరారు. మంగళవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావే శం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ ఉదయం పోలిపల్లి పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ఆలయంలో పూజల అనంతరం నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ప్రజాగళం సభను విజయవంతం చేసినందుకు అభినందనలు తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుమల వెంకట మన్మథరావు, గురవాన నారాయణరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ● బూరాడపేటకు చెందిన పలు వైసీపీ కుటుంబాలు శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో టీడీపీలో చేరాయి. వారిని కోండ్రు ఆహ్వానించారు.

చీపురుపల్లిని సస్యశ్యామలం చేస్తా: కళా

గుర్ల: చీపురుపల్లి నియోజకవర్గాన్ని సస్యశ్యామలంగా మార్చి రైతుల కోసం తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానని కూటమి అభ్యర్థి కిమిడి కళావెంకటరావు అన్నారు. పల్లిగండ్రేడు, కొండగండ్రే డు, ముద్దాడపేట తదితర గ్రామాల్లో ఆయన మంగళవారం ఎన్నికల సభలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ మహేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడ్డిగెడ్డలోకి సాగునీరు అందించే బాధ్యత తీసుకుంటానన్నారు.

మాయమాటలు చెప్పేవారికి ఓట్లు వేయొద్దు

రామభద్రపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మాయమాటలు చెప్పి మోసపూరిత వాగ్దానాలు ఇచ్చిన నాయకులను నమ్మవద్దని కూటమి బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన కోరారు. జోగిందొరవలస, కర్రిందొరవలసల్లో మంగళవారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: వైసీపీ విషపు క్రీడలకు వలంటీర్లు బలికావద్దని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన హితవు పలికారు. బొబ్బిలి కోటలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నాయకులు తమ మెడలపై కత్తి పెట్టి రాజీనామాలు చేయిస్తున్నారని వలంటీర్లు తనకు ఫోన్‌లో చెబుతూ బాధ పడుతున్నారన్నారు. వైసీపీ నాయకుల చేతిలో వలంటీర్లు మానసిక చిత్రహింసలకు గురవుతున్నారని జనసేన కార్యనిర్వహణా కార్యదర్శి పాలూరు బాబు అన్నారు.